కథ



# వృద్ధ సాగరం

చామర్తి ఆచార్య

"సారీ నాన్నా!"

ఈ రోజు ఎన్నోసారో తెలీదు గాని మూడేళ్ల క్రితం వాడి అమెరికా ప్రయాణం ఖరారైన నాటి నుంచి వాడికిది చెప్పడం అలవాటయి పోయింది. నేను ఒంటరి జీవితానికి సిద్ధ మవ్వాలన్న సంగతి నాకు ఆనాడే తెలిసి పోయింది.

నేను రిటైరయిన రెండేళ్ళకి ఇంట్లో నేనూ మా ఆవిడే మిగిలాం. విదేశాలకు వెళ్లాలనే నా ఒకప్పటి కోరిక వీడి ద్వారా నెరవేరినందుకు నేను ఆనందించేను. మా ఆవిడ మాత్రం కృంగిపోయింది. ఆ బెంగతోనే మరో రెండేళ్లలో కాలం చేసింది. నా జీవితం మరీ ఒంటరిదయిపోయింది.

అమెరికా నుంచి తరచూ వచ్చే కాల్స్, ఇంట్లో టెలివిజన్ తప్పించి మరొక వ్యాపకం లేకపోయింది. నన్ను తనతో పాటు అమెరికా తీసుకెళ్లడానికి వాడు చేయని ప్రయత్నమంటూ లేదు. విజిటర్స్ వీసాపై ఏడాదికి ఆరు నెలలు వాడితో వుండే అవకాశంకోసం ముందు ప్రయత్నించాం.

కానీ వెళ్లి వున్న మొదటిసారే నేనక్కడ ఇమడలేకపోయాను. భారతదేశంలోని ఒంటరితనాన్ని పోగొట్టుకోవడం కోసం అమెరికాలో గృహనిర్బంధాన్ని అనుభవిస్తున్నాను అనిపించింది. మరి వెళ్లలేదు.

మరో ఏడాదికి వాడు అక్కడే ప్రేమించిన ఓ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానన్నాడు. సరేనన్నాను. క్రమంగా వాడు నా నుంచి దూరమయ్యాడు.

ఇందులో ఏదీ, ఎంతవరకు, ఎవరి తప్పు? అంతా సహజంగానే జరిగిపోయింది. నా గురించి వాడిని ఇక్కడే భారతదేశంలోనే ఉద్యోగం చూసుకోమనవలసిన అవసరం నాకు కనిపించలేదు. అది స్వార్థమనిపించింది.

నా ఈ ఆలోచనల వెనుక మరొక బలమైన కారణం వాడికి నాకు మధ్య వున్న నమ్మకం మైళ్ల కొద్దీ మా మధ్య విస్తరించిన దూరం మా మధ్యన మానసికమైన ఏ దూరాన్నీ ఏర్పర్చలేదు. అదే ఆప్యాయత, అభిమానమూ.

***

గత ఏడాదికి వరుసగా జరిగిన వృద్ధుల హత్యలు నా జీవితాన్ని మళ్లీ మలుపు తిప్పేయి. విదేశాల్లో పిల్లలు స్థిరపడగా ఇక్కడ ఒంటరిగా వుంటున్న వృద్ధులను దోచుకోవడమూ, ఆ ప్రయత్నంలో భాగంగా చంపడానికి కూడా వెనుకాడని రెండు మూడు ఉదంతాలు మావాడిలో కలవరం కలిగించాయి.

ప్రతిరోజు ఫోన్ చేసేవాడు. వాడు, కోడలు 'అమెరికా వచ్చేయమనేవారు' అయితే ఆర్నెల్లకి లభించే సెక్యూరిటీని నేను సీరియస్‌గా పట్టించుకోలేదు.

దురదృష్టవశాత్తు నా ఇంట్లోనే దొంగతనం జరిగింది. నేను ఏమాత్రమూ ప్రతిఘటించక పోయినా వాళ్ల జాగ్రత్త కోసం నన్ను కొట్టేరు. అది నాకు పెద్ద షాక్.

కొడుకు, కోడలు సెలవు పెట్టుకొని వచ్చేరు. వాళ్ల మధ్యన గడిపిన క్షణాలు నన్ను త్వరగా కోలుకునేలా చేసేయి. ఆ రెండు నెలల పాటు జరిగిన తర్జనభర్జనలలో చివరికి నేనలా వంటరిగా వుండే బదులు వృద్ధాశ్రమంలో వుండడం అన్ని విధాలా మంచిదని తేల్చాం. వాడు, కోడలు కలిసి హైదరాబాద్ మొత్తాన్ని గాలించేరు. చివరికి ఈ ఆశ్రమాన్ని ఎంచాం.

అనుపానులు చూసుకునేందుకు ఇంతకుముందు ఒకసారి ఇక్కడికొచ్చాను. ఆశ్రమం బాగుంటుంది. ఎవరికి వారికి వారిదైన ప్రత్యేకంగా కాటేజీలు. కావాలనుకుంటే ఎవరితోనయినా గదుల్ని షేర్ చేసుకోవచ్చు. సంవత్సరానికి వేలల్లో ఫీజు, ఓ లక్ష డొనేషను. అనుక్షణం అందుబాటులో ఓ డాక్టరు. ఆశ్రమం చుట్టూ సోలార్ ఫెన్సింగ్. నా ఇంట్లో నుంచి సుమారుగా అన్ని వస్తువులనూ తెచ్చేసి పెట్టుకోవచ్చు. మంచి భోజనం.

ఇలా అన్ని విషయాలు నచ్చేయి. 'సరే' అన్నాను.

అప్పుడు కలిసేడు జగ్గడు. సుమారు ముప్ఫయి ఏళ్ల తర్వాత కలిసిన పాత పరిచయం.

''బాగున్నావా?'' అడిగేను ఆశ్చర్యం కలిసిన ఆనందంతో.

''బ్రహ్మాండంగా. ఏంటి, నువ్విలా? ఇక్కడ?'' అడిగేడు.

నవ్వేను.

''సర్లే... ఎప్పుడు చేరుతున్నావ్?'' అడిగేడు.

''మరో మూడు వారాల్లో మా అబ్బాయి, కోడలు నా దగ్గరే వున్నారు ప్రస్తుతం. నెలాఖరున వాళ్లు అమెరికాకి, నేను ఇక్కడికి.''.

''కథ పాతదేలే. కానివ్వు. అన్నట్లు, నీకోసం ఇక్కడ ఒక సరికొత్త కథ వుంది. ప్రస్తుతానికి సస్పెన్స్. నువ్విక్కడికొచ్చేక చెబుతాను. కలుద్దాం మరి. ప్రస్తుతం చాలా అర్జంట్ పనిమీదున్నాను.'' అని వెళ్లిపోయేడు. బహుశాః దమ్ముకొట్టడానికి అయివుంటుంది.

వయసు మీద పడడం వల్ల కాస్త నెమ్మదించేడు గానీ అదే దర్జా, దర్పం, హుషారు.

***

''ఉంటాం నాన్నా. ఫార్మాల్టీస్ మొత్తం పూర్తయినట్టే. ఏ అవసరమైనా మాకు ఫోన్ చెయ్యండి. రెండు రోజుల్లో మీ ముందుంటాం.'' అంటున్న మా వాడిని చూస్తుంటే నాకు ముచ్చటేసింది.

''మామయ్యగారూ! మిమ్మల్ని ఇలా వదిలి వెళ్లడం గురించి మా ఇద్దరికీ చాలా బాధగా వుంది. దయచేసి మమ్మల్ని అపార్థం చేసుకోకండి. అమెరికాకి మేము వెళ్లి నాలుగేళ్లే అవుతోంది. మేమే అక్కడి సిటిజెన్స్ అయి వుంటే మిమ్మల్ని పూర్తిగా తీసుకెళ్లి వుండే వాళ్లం...'' అంటున్న నా కోడలి మాటల్ని ఆపేను.

''నా కంతా తెలుసమ్మా. నా కొడుకుపైనా, వాడి భార్యవైన నీ మీద నాకు పూర్తి నమ్మకం వుంది. మిమ్మల్ని ఎప్పుడూ తప్పుగా తీసుకోను. అమెరికా రాకపోవడానికి కారణం నా స్వంతం. అక్కడి ఒంటరితనం నేనసలు భరించలేను. ఏవీ మనసులో పెట్టుకోకుండ వెళ్లి రండి.'' ఆశీర్వదించేను.

వాళ్లని కారు ఎక్కించి ఆశ్రమం వైపు అడుగులేశాను.

పెద్ద బోర్డు, గేట్. బాగా పెరిగిన చెట్లతో పచ్చగా భాసిస్తోంది. ఆశ్రమం. ప్రస్తుతానికి నా ఒక్కడికే ఓ కాటేజీ తీసుకున్నాను. మరీ ఒంటరితనం అనిపిస్తే ఎవరినైనా చేర్చుకోవచ్చు.

గేటు నుంచి తిన్నగా మెటలింగ్ రోడ్డు. అటు ఇటు కాటేజీలు. చివరి కాటేజ్ నాది. నా ఎదురు కాటేజీలోనే జగ్గడుంటున్నాడు. వాడికలా చివరన

''ఒరే కైలాసం ముఖ్యంగా నువ్వు విను. పెళ్లామో పిల్లలో... అని అలా జపం చేస్తూ బ్రతుకుతున్నావు. ఎంత అర్థం లేని బ్రతుకో నీకిప్పుడు తెలీదు. అదంతా అనవసరంరా. నువ్విలా ఎంత కష్టపడిపోయినా, రేపు పెద్దయ్యాక నీ పిల్లలు వాళ్ల దారి వాళ్లు చూసుకుంటారే గాని నిన్ను పువ్వుల్లోనూ కళ్లల్లోనూ పెట్టేసుకుంటారనుకోకు. వాళ్ల దారి వాళ్లది. నీ దారి నీది. అది లోకరీతి.''

వుండడం ఇష్టం.

మొదటి నుంచి ఉలిపికట్టె తత్వం వాడిది. ప్రపంచంలోని 'ఉత్తమ స్వార్థపరుడు' అనే బిరుదివ్వాలంటే మొదటి స్థానానికి ఎన్నదగినవాడు.

దత్తపుత్రుడు. ఆస్తి దక్కేవరకు కన్నవారిని, పెంచుకున్న వారిని కన్నబిడ్డల్లా చూసుకున్నాడు. అప్పట్లో వృద్ధాశ్రమాలు లేనందువల్ల అనుకుంటా, ముసలాళ్లయ్యాక వాళ్లని గాలికి వదిలేశాడు.

పెళ్లాం–బిడ్డలు ఇంట్లో వుంటే అనవసరమయిన గోల అని మనశ్శాంతి కోసం రెండో ఇంటిని నడిపేవాడు.


ఆ రోజుల్లో నేను, వాడు కలిసి పనిచేసేవాళ్లం. మాతో పనిచేసే కైలాసరాజును కలిపి మమ్మల్ని త్రిమూర్తులనేవారంతా. త్రిమూర్తులులాగానే మా ముగ్గురివీ మూడు సూత్రాలు, జీవనరీతులు.

కైలాసరాజు 'కుటుంబం, కుటుంబం' అని ఇరవై నాలుగు గంటలూ కలవరించేవాడు. జగ్గడికి కన్నపిల్లలే పట్టేవారు కాదు. నాది మధ్యేవాదం–కర్మ సిద్ధాంతం.

గంటల తరబడి చర్చలయ్యేవి మా మధ్యన.

పెళ్లాం పిల్లల్ని కనీసం పట్టించుకోకుండా జగ్గడు అలా బలాదూర్ తిరగడం మాకు అస్సలు నచ్చేది కాదు. నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తే మాత్రం 'మీవి బూటకపు మాటలూ తత్వాలూ' అని కొట్టిపారేసి, తిరిగి మా విధానాలే తప్పనేవాడు.

''ఒరే కైలాసం ముఖ్యంగా నువ్వు విను. పెళ్లామో పిల్లలో...అని అలా జపం చేస్తూ బ్రతుకుతున్నావు. ఎంత అర్థం లేని బ్రతుకో నీకిప్పుడు తెలీదు. అదంతా అనవసరంరా. నువ్విలా ఎంత కష్టపడిపోయినా, రేపు పెద్దయ్యాక నీ పిల్లలు వాళ్ల దారి వాళ్లు చూసుకుంటారే గాని నిన్ను పువ్వుల్లోనూ కళ్లల్లోనూ పెట్టేసుకుంటారనుకోకు. వాళ్ల దారి వాళ్లది. నీ దారి నీది. అది లోకరీతి.'' అంటూ




మొదలుపెట్టేవాడు.

''దారుణంగా సమర్థించుకుంటున్నావు గానీ అందరూ అలానే వుండరు. అంతా పిల్లలకు మన మందించే అభిమానం, ఆప్యాయతల పైన, వాళ్ళని మనం పెంచే పద్ధతుల పైన ఆధారపడి వుంటుంది. మంచి వాతావరణంలో చక్కని విలువలతో పెంచితే బాధ్యతలన్నీ వాటంతట అవే అలవడు తాయి. ఈరోజు చెబుతున్నా. చూడు. చెయ్యి కాలు ఆడని రోజంటూ వస్తే నా పిల్లలే నన్ను ఆదుకుం టారు. మరొకటి కూడా నిజం. నువ్విప్పుడు నీ పిల్లల పట్ల చేస్తున్నదానికి ఫలితం తప్పకుండా కని పిస్తుంది. వాళ్ల పట్ల నువ్వు చేస్తున్నది ముమ్మాటికి అన్యాయం''

''నేను చేస్తున్నది న్యాయమా? అన్యాయమా? అనేదాని గురించి నేనిప్పుడు వాదించదలచుకో లేదు. కానీ రేపేదో జరిగిపోతుందని ఆ జరుగు తుందో జరగదో తెలియనిదానిని గురించి ఊహించుకుంటూ ఇవేళ వెట్టిచాకిరి చేస్తావు. రేపు వాళ్లు నీ చేతిలో చిప్పపెట్టి వాళ్ల బాగు వాళ్లు చూసు కుంటూ వెళ్లిపోతే అప్పుడు ఏడుస్తావు. చివరకి ఏం సాధిస్తావు? అదీ నా పాయింటు. ఆ ప్రశ్నకి జవాబు నేను బ్రతికి చూపిస్తున్నాను''

''సరేరా... కైలాసంది కాస్త శృతిమించిన ధోరణే కానీ, పెళ్లంటూ చేసుకున్నాక, పెళ్లాం, పిల్లలు, నీ బాధ్యతలుంటాయి. పిల్లలను మంచి విలువలతో పెంచడం, వాళ్లకు విద్యాబుద్ధులు చెప్పించడం ఆ బాధ్యతలలోని భాగాలే అవుతాయి. ముందు నీ బాధ్యతని నువ్వు నిర్వర్తించు. వాళ్లు నీ ముసలిత నంలో సాయపడితే మంచిదే, లేదంటే లేదు'' మధ్యలో నేను కలుగజేసుకున్నాను.

''బాబూ, నీకు నీ కర్మ సిద్ధాంతానికి ఒక దండం. మేమంత గొప్పవాళ్లం కాము. నా వరకు నా ఆనందం కోసమే, నా గురించి మాత్రమే బ్రతుకు తాను. ఒకరికి అన్యాయం చేయను. నన్ను నమ్ముకో వడం, నా పైన ఆధారపడడం వల్ల ఎవరైనా నష్ట పోతే అది ముమ్మాటికి నా తప్పు కాదు.''

కైలాసం ఉక్రోషాన్ని ఆపుకోలేకపోయాడు. ''ఔన్లే, కుటుంబం అంటే అర్థం తెలీనట్లు ప్రవర్తించే నీకు ఏం చెప్పినా వ్యర్థమే. రేపొద్దుట నీ కొడుకు ఎందుకూ పనికిరాకుండా పోవడం వల్ల నీకు ఏ మాత్రమూ బాధ కలగదు సరికదా, లాభసాటిగానే ఫీలవుతావు. వాడి ప్రతి అవసరానికి నీ ముందు చెయ్యి చాచి జీవితాంతం నువ్వు ఏం చెబితే అది వింటాడు. ఛీ... ఛీ... నీకసలు ఆత్మసాక్షి లేదురా..''

కైలాసం ఆవేశాన్ని జగ్గడు మధ్యలోనే ఆపేస్తూ అన్నాడు- ''ఒరే ఈ ఆత్మలూ సాక్షులూ నువ్వను కుంటున్న మనశ్శాంతిని నిజంగా అందించలేవురా. అసలు ఈ పదాలకి నిజమైన అర్థమేంటో కూడా ఎవరికి తెలీదు. కైలాసం శాంతంగా కూర్చొని ఆలో చించు. నేను నా పిల్లలకి, పెళ్లానికి తిండిపెడుతు న్నాను. ఉండడానికి ఒక ఇల్లు కట్టించి ఇచ్చాను. ఇక నేను చెయ్యనిది ఏంటంటే, మీలాగ ఇంటిదగ్గర కూర్చొని కాలం గడపడం. నిజానికి అలా గడప డాన్ని పెట్టుబడిగా పెట్టి వృద్ధాప్యంలో భరోసా అనే లాభాన్ని గడిద్దామని ఒక వ్యాపారాన్ని చేస్తున్నావు నువ్వు. ఆ లాభం ఉండదని నమ్ముతున్నాను గనుక ఆ వ్యాపారాన్ని నేను చేయడం లేదు. నాకు ఈ రోజే విలువైంది. వాస్తవమైనదీను, ఉన్నంతలో ఆనందాన్ని అనుభవిస్తాను.''

ఆనందం! బాధ్యతలలో ఆనందం వెదుక్కోమని కుటుంబ వ్యవస్థ సూచిస్తుంది. శాసిస్తుంది. అందులో ఆనందమేముందని తప్పుకుంటే నష్టపో యేది కుటుంబమే. ఆ కుటుంబంలో తానూ ఒక భాగాన్నని గుర్తించనంతవరకూ వ్యక్తిగా తాను నష్ట పోతున్నదేంటో తెలీదు మరి!

***

జగ్గడు తన పెళ్లాం పిల్లలకి చేసిన అన్యాయం, కైలాసం తన పిల్లలపట్ల, కాలం పట్ల చూపించిన గుడ్డి నమ్మకం, మితిమీరిన అటాచ్‌మెంట్ నా విధా నంలో లేని అవలక్షణాలు. అంతమించి నాకు అనవ ససరం కూడా.

ఆలోచనల్లో వుండి నా కాటేజీ తాళం తీస్తుంటే, ''ఏంటోయ్! మనిషివి ఏదో లోకంలో వున్నావ్? వారం రోజుల్లో ఈ వాతావరణానికి అలవాటు పడి పోతావ్...'' నవ్వుతూ పలకరించేడు జగ్గడు.

''ఎక్కడికో బయలుదేరినట్టున్నావ్?'' అడిగాను వాడి వాలకం చూసి.

''ఏం చేయను చెప్పు? పెళ్లాం, ప్రియురాలు, పిల్లలు అందరినీ కాదనేసుకోగలిగాను కానీ, ఈ ట్రిపుల్ వైఫ్‌ని మాత్రం వదులుకోలేకపోతున్నాను. క్యాంపస్‌లో సిగరెట్ ముట్టిస్తే మొత్తం ఆశ్రమం అంటుకుపోయినంత గోలయిపోతుంది. చచ్చినట్లు బయటికి పోవలసిందే''

''సిగరెట్ తాగడానికి నువ్వయిన ముస్తాబు చూస్తుంటే ముచ్చటేస్తోందిరా. భలే జల్సారాయుడి వి!'' మనస్ఫూర్తిగానే అన్నాను.

''నీ ముచ్చట సంగతి తర్వాత నీకొక సరికొత్త కథ చెబుతానన్నాను గుర్తుందా? నాతోరా..'' అని లాక్కుపోయాడు.

ఒక కాటేజీ ముందు ఆగి, ''లోపలకెళ్లి చూడు. ఈ లోపున నా పని చూసుకొని వస్తాను.'' అని వెళ్లి పోయాడు.

తలుపు కొట్టి ''లోనికి రావచ్చాండీ?'' అన్నాను. కైలాసం భార్య తలుపుతీసి, ఆశ్చర్యపోయింది.

''ఎంత ఆశ్చర్యం?! రండి, రండి'' అంటూ ఆహ్వానించింది.

నాకూ ఆశ్చర్యమేసింది. గదిలో కైలాసరాజుని చూసి చాలా ఆనందం కలిగింది. అంతకుమించిన ఆనందం కైలాసం కళ్లలో.

మనిషి బాగా పాడయిపోయాడు. కృంగిపో యాడు.

చాలాసేపు మాట్లాడుకున్నాం. వాడి గోడు

చెప్పుకున్నాడు, చాలా మామూలు కథ.

అమ్మాయికి అమెరికా సంబంధం. అల్లుడు మంచోడేనట. కానీ వాడి చెల్లెలి మొగుడ్ని శాంతింపజేయడం కోసం అప్పుడప్పుడూ కైలాసం నెత్తినెక్కి తాండవం చేస్తుంటాడు. పెళ్లాన్ని సరదాగా వదిలేస్తానంటూ వుంటాడు. నా చెల్లెలి మొగుడి కాళ్లు నేను పట్టుకుంటూ వుంటాను కాబట్టి మీరూ నా కాళ్లు పట్టుకోవాలి అని మారాం చేస్తుంటాడు.

ఒక కొడుకు సంగతి. కైలాసం పెంపకంలో పెరిగిన అతి మంచివాడు. ముల్లోకాలు వెదికి ఓ అందాలరాశిని పట్టుకొచ్చి కట్టబెట్టాడు. ఆ అమ్మాయికి మొగుడే సర్వస్వం. అందువల్ల తనకి అత్తమామల పొడ వద్దనుకుంది. నిత్యపోరు. సర్దిచెప్పలేక కొడుకు నలిగిపోయేవాడు. వాడి బాధ చూడలేక కైలాసం నలిగిపోయేవాడు. చివరికోరోజు, కలిసి వుండి పోట్లాడుకునే బదులు విడిపోయి ప్రశాంతంగా బతకడం మేలని గత్యంతరంలేక నిర్ణయించేరు తండ్రీ కొడుకూ. ఫలితంగా కైలాసం, భార్యతోపాటు ఆశ్రమంలోకి వచ్చి పడ్డాడు.

ఇప్పుడు రోజూ ఆ కొడుకొచ్చి వీళ్లతో గడిపి వెళ్తాడు. రోజూ ముగ్గురూ కూర్చొని కాసేపు కలిసి బాధపడ్తారు. వీలయినంత వరకూ ఏడుస్తారు. అదీ వాడి జీవితం! అంతా చెబుతూ భార్యాభర్తలిద్దరూ మరొకసారి కన్నీళ్లు పెట్టుకున్నారు.

అంతా విన్న తర్వాత వాడిపైన జాలి కాదు కానీ కోపం వచ్చింది నాకు.

తమాయించుకొని అన్నాను– ''అయిందేదో అయింది. ఎదురుదెబ్బల్ని తల్చుకుని బాధపడకూడదు. వీలయితే నేర్చుకోవాలి. ఇప్పుడు కూడా నీకిక్కడ వచ్చిన కష్టమేదీ లేదు. అందుబాటులో డాక్టరు. సమయానికి మంచి భోజనం. నీ భార్య నీతోనే నీ బాగోగులు చూసుకుంటూ వుంది. నువ్వు అమితంగా అభిమానించిన కొడుకు నిన్నిప్పటికీ అదే అభిమానంతో చూస్తున్నాడు. వేరే ఒక ఇంటిలో వుంటున్నావు అనే మిష తప్పిస్తే ఇంకా ఏమీ కావాలి నీకు?''

''అంతేనా కావలసింది? అలా మెటీరియలిస్టిక్‌గా ఎలా మాట్లాడుతున్నావు నువ్వు? మనుమలు, మనవరాళ్లతో కళకళలాడుతూ వుండాల్సిన మేమూ– ఇలా అనాథల్లా....''

''అనాథలని నువ్వు అనుకుంటే బాధగా వుంటుంది. కానీ, ఇక్కడి ప్రశాంతత, సహజమైన వాతావరణం నీ కొడుకు వుంటున్న అపార్ట్‌మెంట్‌లో దొరకదు కదా? అలాంటి విషయం గురించి ఆలోచించవెందుకు?''

''చెట్టూ పుట్టలూ, సమయానికి భోజనం చూసుకొని తృప్తిపడి స్వంత మనుషుల్ని మరచిపోవడానికి నేను జగ్గడిలా బ్రతకలేను...''

''మధ్యన వాడి గొడవెందుకులే.. అయినా వాడే నయం. నీలాగా కృంగిపోలేదు. వాడిని చూసి నువ్వు నేర్చుకోవలసింది ఖచ్చితంగా చాలా వుంది. ఒకప్పుడు ఎంత ఉత్సాహంగా వుండేవాడో ఇప్పటికీ అంతే ఉత్సాహంగా వున్నాడు. వాడికోసమే బ్రతుకుతున్నాడు. బ్రతుకుతాడు కూడా. నీలా రోజూ ఇలా దిగులు పడేకంటే అదే మంచిదనిపిస్తోంది నాకు.'' వీలయినంత అనునయాన్ని తెచ్చిపెట్టుకుని అన్నాను.

కైలాసం కస్సుమన్నాడు. ''వాడిని చూసి నేర్చుకోవాలా? వాడి నిర్వాకం వల్ల పిల్లలు ఇప్పటికీ నిలదొక్కుకోలేకపోయారు. వీడినో విలన్‌లాగా చూస్తున్నారు పెళ్లాం, పిల్లలూ. ఇంటి నుంచి ఎప్పటికైనా గెంటేసే ప్రమాదముందని అనుమానించి బైట కొచ్చి ఇక్కడపడ్డాడు. నా అనేవాడు ఒక్కడూ లేని ఆ బ్రతుకూ ఒక బ్రతుకేనా?''

''నేను చెబుతున్నదీ అదే. వాడి జీవితంలో జరిగిన తప్పులు నీ జీవితంలో లేవు. నా అనేవాళ్లు నీకున్నారు. వున్న దానితోనే సరదాగా కాలం గడిపేస్తున్న జగ్గడి దగ్గర నుంచి మనం నేర్చుకోవలసింది అదే. ఆత్మసంతృప్తి, లేనిదాని గురించి, కానిదాని గురించి ఏడుస్తుండడమేనా జీవితమంటే?''

వాడు నా మాటలు వినడం మానేసి చాలా సేపయింది.

''ఎన్నో కష్టాలు పడి పిల్లల్ని పెంచేము. జీవితంలోని చివరిదశకొచ్చేశాము. ఈ దశలో కూడా నాకు కష్టాలే రాసిపెట్టాడేంటో ఆ దేవుడు...'' తనలో తను అనుకుంటున్నట్లు అంటున్నాడు.

కొన్ని జీవితాలంతే. బాధపడడానికే పుడతారు.

మరికాస్సేపుండి బైటకొచ్చేను.

బైట ఎదురుచూస్తూ జగ్గడున్నాడు. ఎంత సేపైందో వచ్చి. నా వైపు నవ్వుతూ చూస్తున్నాడు.

''విధి గొప్పది. పూర్తిగా విరుద్ధమైన సిద్ధాంతాల్తో బ్రతికిన నేను, కైలాసం, గోడమీద పిల్లి వాటంగా కర్మసిద్ధాంతాన్ని అడ్డం పెట్టుకుని బ్రతికిన నువ్వూ చివరికి వృద్ధాశ్రమంలోనే తేలేం'' తనదైన శైలిలోనే కాస్త వేదాంతం పలికేడు జగ్గడు.

నాకు నవ్వొచ్చింది. అంతే మరి. ఎవరి సిద్ధాంతం వాళ్లకి సరైనదనిపిస్తుంది. పైగా ఇతర సిద్ధాంతాలు పనికిమాలినవిగా అనిపిస్తాయి. నా సిద్ధాంతాన్ని జగ్గడు, కైలాసం పలాయనవాదమని అనుకోవడంలో తప్పేముంది?

★

